

# వాంటెడ్

**శ్రీకంఠమూర్తి**

ది సాగర్ ట్రేడింగ్ కంపనీ
పి. బి. నం 4281
హైదరాబాదు
తేదీ : 15-8-1975

మా కంపనీలో అకౌంటెంట్సు ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థులనుండి దరఖాస్తులు కోరుతున్నాం. దరఖాస్తు పెట్టుకునే అభ్యర్థి బి. కామ్. ఫస్ట్ క్లాసులో ప్యాసయి వుండాలి అకౌంట్సు చూడ్డంలో కనీసం రెండు సంవత్సరాల అనుభవం వున్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది అభ్యర్థులు ఒకవేళ ఉద్యోగాలకు సెలెక్ట్ అయితే వారు నివసించడానికి కంపనీ క్వార్టర్స్, ఇంకా ఇతర సౌకర్యాలుకాక పమోషన్లు కూడా వుంటాయి. దరఖాస్తు పంపగోరువారు 10 రూపాయల పోస్టల్ ఆర్డర్‌తోబాటు ఇటీవల తీయించుకున్న ఫోటోలు రెండు (పాస్‌పోర్ట్ సైజువి) జతపరచి పంపవలసి వుంటుంది. దరఖాస్తుతోబాటు పంపించే అన్ని సర్టిఫికేట్లకూ గెజెటెడ్ అఫీసర్ల సంతకాలు తప్పకుండా వుండాలి. దరఖాస్తులు పంపుకోవడానికి ఆఖరుతేదీ 1-9-1975. ఉద్యోగాలకు అభ్యర్థులను సెలెక్ట్ చేసుకునేదీ, చేసుకోకపోయేదీ మా ఇష్టానికి సంబంధించిన విషయం. ఈ విషయంలో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలకూ తావులేదు

To
ది సాగర్ ట్రేడింగ్ కంపని
పి. బి. నం. 4281
హైదరాబాదు

From
సి. రామచంద్రరావు బి. కామ్.
డాబా గార్డెన్
విశాఖపట్నం
తేదీ 17-8-1975

15 వ తేదీ దిన పత్రికలో అచ్చయిన మీ ప్రకటన ప్రకారం నేను అకౌంటెంట్ పోస్టుకు దరఖాస్తు పంపుతున్నాను.

నేను బి కామ్. ఫస్టు క్లాసులో ప్యాసయ్యాను ఇదివరకు ఓ కంపెనీలో ఉద్యోగం చేయడంవల్ల మూడు సంవత్సరాల అనుభవం వుంది అంతేకాకుండా సొంత వ్యాపారంలో చేతులు కాల్చుకున్న రెండు సంవత్సరాల అనుభవం కూడా వుంది. నా వయసు 28 సంవత్సరాలు. ఎంప్లాయ్ మెంట్ ఎక్స్ చేంజీ లో పేరు నమోదు చేయించి ఒక సంవత్సరం దాటింది. నా పుట్టిన రోజు పండగను వచ్చే నెలలో జరుపుకోబోతున్నాను కాబట్టి అంతకుముందే నాకు ఉద్యోగం ఇస్తే పుట్టినరోజు పండుగను మరి కొంచెం ఘనంగా జరుపుకో వచ్చు. నేను మంచి వ్యాపార దక్షత గల వాణ్ని కాబట్టి- ఇదివరకటి ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి - సొంత బిజినెస్ ప్రారంభించ గలిగాను రెండేళ్ళలో నా వ్యాపారం బాగా వృద్ధి చెందింది. కాని వెధవది ఎమర్జన్సీ రావటం వల్ల నేను బిజినెస్ చేస్తున్న వస్తువులకు కంట్రోల్ ఏర్పడి వాటి రేటు పడి పోయింది. అందువల్ల నేను చాలా నష్ట పోయాను. అందుకని ఇప్పుడు ఉద్యోగం చేయడం తప్పని సరైంది. అంతలో మీ ప్రకటన చూసి ఈ దరఖాస్తు పంపుకుంటున్నాను. కాబట్టి నా పరిస్థితి అర్థం చేసుకుని నా మీద దయతలచి ఉద్యోగం ఇస్తే మీకు నేనెంతో రుణపడి వుంటాను. 10 రూపా

అనేక విషయాల

అధ్యయనం

ప్రజాతంత్ర

చదవడం

యల పోస్టల్ ఆర్డర్‌ను కూడా దీనితో జత పరచి పంపుతున్నాను. నా డూప్లికేట్ సర్టిఫికేట్లకు గెజిటెడ్ ఆఫీసర్ల సంతకాలు చేయించే స్థితిలో లేను కాబట్టి - అంటే డబ్బిస్తేగాని చేయరు కాబట్టి-వాటిని మాత్రం పంపడం లేదు. నేను అక్కడికి ఇంటర్వ్యూకొచ్చినప్పుడు నా ట్రూ సర్టిఫికెట్లను తీసుకు రాగలను.

ఇట్లు మీ
సి. రామచంద్రరావు.

From
ది సాగర్ ట్రేడింగ్ కంపని
పి. బి. నం. 4281
హైదరాబాదు
తేది : 20-10-1975.

శ్రీ సి. రామచంద్రరావుగారికి,

మా కంపెనీకి 12,000 మంది అభ్యర్థుల నుండి దరఖాస్తులు వచ్చాయి. ఇప్పుడు మీకు తెలియ చేయడ మేమనగా మేము ఈ నెల 29 వ తేదీన నిర్వహించే ఒక చిన్న పరీక్షకు మీరు హాజరు కావలసి వుంటుంది. ఆ రోజు మధ్యాహ్నం ఒంటిగంటకు మీరు పెన్ను పేపరుతో మా కంపనీకి రావలసి వుంటుంది. మీరిక్కడకు రావడానికి అయ్యే ఖర్చులూ, బస, భోజనం ఖర్చులు మీరే భరించ వలసి ఉంటుంది. అంతే కాకుండా పరీక్షఫీజు 10 రూపాయలు చెల్లించాల్సి వుంటుంది. లేకపోతే పరీక్షకు ప్రవేశం దొరకదు. గమనించగలరు.

From
ది సాగర్ ట్రేడింగ్ కంపని
పి. బి. నం. 4281
హైదరాబాదు.
తేది : 31-10-1975

శ్రీ సి. రామచంద్రరావుగారికి,

మొన్న జరిగిన పరీక్షలో మీరు పాసయ్యారని తెలియపర్చడానికి సంతోషిస్తున్నాం. మీకివ్వబోయే ఉద్యోగం డబ్బు వ్యవహారాలకు సంబంధించింది కాబట్టి మీరు డిపాజిట్‌గా 1,500 రూపాయలు పది హేను రోజుల్లోగా కట్టవలసి వుంటుంది. ఈ వ్యవధిలో మీ డిపాజిట్ మొత్తం గనుక మా చేతికి అందక పోయినట్టయితే మా ఫైల్ నుంచి మీ పేరు తొలిగించడం జరుగుతుంది. గమనించగలరు.

To
ది సాగర్ ట్రేడింగ్ కంపని
పి. బి. నం. 4281
హైదరాబాదు.

From
సి. రామచంద్రరావు, బి.కామ్
డాబా గార్డెన్
విశాఖపట్నం
తేది: 2-11-1975

మీరు ఉత్తరంలో తెలిపిన ప్రకారం నేను 1500 రూపాయలకు డ్రాఫ్ట్ పంపుతున్నాను. మీ కంపెనీకి ఉద్యోగంకోసం దరఖాస్తు పంపుకుని మూడు నెలలు గడిచిపోయాయి. ఇప్పటికైనా కాస్త త్వరగా నన్ను ఉద్యోగంలోకి తీసుకుంటే మీకు నేనెంతో కృతజ్ఞుణ్ణి.

ఇట్లు మీ
సి. రామచంద్రరావు

From

ది సాగర్ ట్రేడింగ్ కంపెని
పి. బి. నం, 4281
హైదరాబాదు
తేది : 31-10-1976

శ్రీ సి. రామచంద్రరావుగారికి,

మేము 20-11-1976 న జరిపే ఇంటర్వ్యూకు మీరు హాజరు కావాల్సిందిగా కోరుతున్నాం. మీతోబాటు మీ సర్టిఫికేట్లన్నీ తీసుకురావాలి. ఆ రోజు జరిగే ఇంటర్వ్యూకు చాలా మంది అభ్యర్థులు వస్తారు కాబట్టి అందరినీ ఒకే రోజున ఇంటర్వ్యూ చేయడం కుదరదు. అందువల్ల మరో రోజుకు వాయిదా పడొచ్చు. అందుకని ఇక్కడికి రావడానికయ్యే ఖర్చులూ, బస, భోజనాల ఖర్చులూ మీరే భరించవలసి వుంటుంది. ఈ విషయాన్ని గమనించగలరు.

From

ది సాగర్ ట్రేడింగ్ కంపెని
హైదరాబాదు
తేదీ : 2-1-1977

శ్రీ సి. రామచంద్రరావు గారికి,

మేము జరిపిన ఇంటర్వ్యూలో మీరు సెలెక్ట్ అయ్యారని తెలియపరచడానికి సంతోషిస్తున్నాం. ఇక వారం రోజుల్లో మెడికల్ టెస్ట్‌కోసం మీరిక్కడికి రావలసివుంటుంది. వచ్చేముందు మేము దీంతో పంపిన ఫారాన్ని పూర్తిగా నింపి, దాంతోపాటు మెడికల్ టెస్ట్ ఫీజుకింద 30 రూపాయలనూ, స్టాంపు అతికించిన ఒక కవరునూ జతపరచి పంపవలసి వుంటుంది. గమనించగలరు.

To

ది సాగర్ ట్రేడింగ్ కంపెని
పి. బి. నం. 4281,
హైదరాబాదు.

From

సి. రామచంద్రరావు
డాబాగార్డెన్
విశాఖపట్నం
తేదీ : 6-1-1977

మీరు ఉత్తరంలో తెలిపిన ప్రకారం 30 రూపాయలూ, దాంతోపాటు స్టాంపుల తికించిన కవరూ పంపుతున్నాను. మెడికల్ టెస్టుకు హాజరవుతున్నాను. అసలు ఉద్యోగంకోసం దరఖాస్తు పెట్టుకుని మీరు కోరిన డిపాజిట్ మొత్తాన్ని కట్టి ఇప్పటికి దాదాపు సంవత్సరంమీద మూడునెలలవుతోంది. కాని మీనుండి ఇంతవరకూ ఉద్యోగం ఇచ్చినట్టు ఏ విధమైన ఉత్తరువూ రాలేదు. నా కిక్కడ వేరే ఏ విధమైన ఆదాయం లేక అల్లల్లాడిపోతున్నాను. కాబట్టి దయచేసి వీలయినంత త్వరగా ఉద్యోగం ఆర్డరు పంపితే మీకెంతో రుణపడివుంటాను.

ఇట్లు మీ
సి. రామచంద్రరావు

From

ది సాగర్ ట్రేడింగ్ కంపెని
పి. బి. నం. 4281
హైదరాబాదు.
తేదీ : 2-2-1977

శ్రీ సి. రామచంద్రరావు గారికి,

మీ ఆరోగ్యం ఏమంత బాగాలేదని మెడికల్ రిపోర్టు ద్వారా మాకు తెలిసింది. ఒడ్డూ పొడుగూ తగినంత లేదనీ, బరువు చాలా తక్కువగా వుందనీ, మీ రక్తంలో కూడా ఏదో లోపముందనీ మా డాక్టరు స్పష్టంగా తెలియజేసినందువల్ల మీరు ఈ ఉద్యోగానికి అర్హులుకారని తెలియపరచడానికి చింతిస్తున్నాం. ఈ విషయంలో ఇక ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలకూ తావులేదని సవినయంగా మనవిచేస్తున్నాం.

To
ది సాగర్ ట్రేడింగ్ కంపని
పి. బి నం. 4281
హైదరాబాదు

From
సి రామచంద్రరావు
డాబా గార్డన్
విశాఖపట్నం
తేదీ 7-2-1977

మీరు పంపిన ఉత్తరం అందింది. నేను బి. కామ్ ప్యాసయినవాణ్ని. మీరు కోరిన అనుభవంకూడా కలిగున్నవాణ్ని. మీరు జరిపిన అన్ని పరీక్షలకూ, ఇంటర్వ్యూలకూ హాజరయి, అన్నిటిలోనూ నెగ్గినా చివరికి 'మెడికల్లీ అన్‌ఫిట్' అన్న నెపంతో నన్ను 'ఉద్యోగానికిఅనర్హుణ్ణి' అని తేల్చారు. గడచిన రెండేళ్ళనుంచీ ఉద్యోగంలేక నానా అవస్థలూ పడుతున్నాను కాబట్టి నా బరువు బాగా తగ్గిపోయివుండొచ్చు. ఉద్యోగం దొరికిన తరు

మీ కుటుంబంలోని యావన్మందినీ
ఆలోచింపచేసే
ప్రజాతంత్ర
ప్రతి వారం చదవండి

వాత నెలరోజుల్లోనే డాక్టరుదగ్గరినుంచి 'ఫిట్ నెస్' సర్టిఫికేట్ తెచ్చి చూపించగలను. మీ కంపెనీకి ఉద్యోగం కోసం దరఖాస్తు పెట్టుకున్నప్పటినుంచీ ఇప్పటివరకూ నాకు ఫోటోస్టేటికి, ఫోటోలకి, ఫీజులకి, డిపాజిట్‌కి ఇంకా నేను రెండు మూడుసార్లు మీ కంపెనీకి రావడానికి-ఇలా అన్నిటికీ కలిపి బోలెడు అప్పులయిపోయాయి. కాబట్టి వీలయినంత త్వరలో అకౌంటెంట్‌గా కాకపోతే మానె చివరికి ఏదైనా క్లర్కు-పోస్టు ఇచ్చినా సంతోషంగా వచ్చి చేరగలనని మనవి చేసుకుంటున్నాను. చిత్తగించవలెను.

ఇట్లు మీ

సి. రామచంద్రరావు

From

ది సాగర్ ట్రేడింగ్ కంపని

పి. బి. నం. 4281

హైదరాబాదు

తేదీ 14-2-1977

శ్రీ సి. రామచంద్రరావు గారికి,

మీరు ఉత్తరంలో పేర్కొన్న ఖర్చులన్నీ మీ ఇష్టప్రకారం చేశారు. ఇందులో మా బాధ్యత ఎంతమాత్రం లేదు. మేము పత్రికలో ప్రకటన ఇచ్చినప్పుడు ఈ ఉద్యోగాన్ని తప్పకుండా మీకే ఇస్తామని హామీ ఏమీ ఇవ్వలేదు. ఈ విషయాన్ని మీరు బాగా గమనించాలి మా ఇష్టం వచ్చిన అభ్యర్థిని ఉద్యోగంలోకి సెలెక్టు చేసుకునే హక్కు మాకు పూర్తిగా వుంది. ఇకనుంచి మీరు మా కంపెనీతో ఎలాంటి ప్రత్యుత్తరాలూ జరపడానికి వీల్లేదని గట్టిగా హెచ్చరిస్తున్నాం.

To

ది సాగర్ ట్రేడింగ్ కంపని

పి. బి. నం 4281

హైదరాబాదు.

From

సి. రామచంద్రరావు, బి. కామ్.

డాబాగార్డెన్

విశాఖపట్నం

తేదీ : 21-2-1977

ఇప్పటికి మీ కంపెనీవల్ల నాకు మొత్తం 850 రూపాయలు ఖర్చయింది. అది కాకుండా నేను డిపాజిట్ కట్టిన 1500 రూపాయల సంగతే మీరు ప్రస్తావించడం లేదు. ఆ మొత్తాన్ని తిరిగి పంపే విషయంలో మీ నుండి ఎలాంటి ఉత్తరమూ నాకందలేదు. కాబట్టి వెంటనే డిపాజిట్ మొత్తంతోబాటు నాకయిన ఖర్చులు 850 రూపాయలుకూడా కలిపి మొత్తం 2,350 రూపాయలను పంపకపోయినట్లయితే మీ కంపెనీమీద చట్టరీత్యా చర్య తీసుకోవలసి వస్తుంది. కాబట్టి ఈ ఉత్తరం అందిన వెంటనే జవాబు రాయగలరు.

ఇట్లు

సి. రామచంద్రరావు

పై ఉత్తరం పంపిన వారంరోజులకే 'రిటర్న్ టు ది సెండర్' అని ఎర్ర సిరాతోనూ. 'అడ్రెస్సీ లెఫ్ట్' అని పచ్చ సిరాతోనూ రాయించుకుని ఆ కవరు క్షేమంగా అతని దగ్గరకే తిరిగొచ్చేసింది ●